కేసీఆర్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాచిగూడ, ఏప్రిల్ 24 : కేసీఆర్ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గండికోట జనార్దన్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, అనునిత్యం కేసీఆర్ వెంట ఉంటూ, పేదల కోసం పాటుపడే పద్మారావుగౌడ్ గెలుపునకు నాయకులు, కార్యకర్త లు కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. పద్మారావుగౌడ్‌ను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు బీఆర్ఎస్‌వే

బంజారాహిల్స్, ఏప్రిల్ 24: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ సీట్లలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 'పోరుబాట' పేరుతో చేపట్టిన బస్సు యాత్ర ప్రారంభోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే మాగంటితో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ..నాలుగు నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసలు నైజం బయటపడిందన్నారు.

పద్మారావు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సమావేశంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు మురా జయసింహ

చిక్కడపల్లి, ఏప్రిల్24 : సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ భారీ మెజార్టీ గెలుపు లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యర్తలు పనిచేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. గాంధీనగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జయసింహ మాట్లాడతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు. సమావేశంలో ఎన్నిక డివిజన్ ఇన్‌చార్జ్‌లు శివ ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేశ్, నాయకులు ముఠా నరేశ్, శ్రీకాంత్, రవిశంకర్ గుప్తా, సత్యనారాయణ,రాజ్‌కుమార్, హన్మంతు, చందు, దేవయ్య, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ముఠా జయసింహ

బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం

ముషీరాబాద్, ఏప్రిల్ 24: అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, దీన్‌దయాల్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్ పాల్గొని పార్లమెంటు ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సయ్యద్ అస్లాం, సురేందర్, బొట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ ఊరేగింపుతో నామినేషన్ దాఖలు

అబిడ్స్, ఏప్రిల్ 24 : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ దాఖలు సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం జంగిల్ విఠోబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వేలాది మందితో ర్యాలీగా బయలుదేరి లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గౌలిగూడ, ఎం.జె. మార్కెట్, నాంపల్లి మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. దారి పొడవునా జై తెలంగాణ ..నినాదాలు మారు మ్రోగాయి. గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు వెళ్తున్నానని తెలిపారు. మతాలను అడ్డం పెట్టుకుని ఓట్లు అడిగే వారికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీల హామీలిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కటి కూడా నెరవేర్చడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ రామచంద్రరాజు, ఆర్.శంకర్‌లాల్ యాదవ్, శీలం సరస్వతి, శాంతి దేవి, ప్రియాగుప్తా, సునీల్ సాహు, రామరాజు, ఎస్.ధన్‌రాజ్, గొడుగు గోపియాదవ్, వినోద్ యాదవ్, జై శంకర్, రమేశ్ గుప్తా, శ్రీనివాస్ గౌడ్, కిట్టు, క్రాంతి, మల్లేశ్ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు అభినందనలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్, శ్రీనివాస్ గౌడ్

12 ఎంపీ స్థానాలు గెలుపొందడం ఖాయం

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బస్ యాత్ర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేసీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ స్వాగతం పలకడంతో పాటు ఏర్పాట్లు చేపట్టారు. తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలతోతో అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రజలు మోసపోయామని తెలుసుకుని తిరిగి బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ 12 స్థానాల్లో ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.

- అబిడ్స్

గడ్డం నామినేషన్.. తరలిన నాయకులు

హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ ర్యాలీకి కార్వాన్ నియోజకవర్గం నుంచి గుడిమల్కాపూర్ బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. గుడిమల్కాపూర్ డివిజన్ ఉపాధ్యక్షులు గున్నాల రంగారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు తరలారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేరి రామారెడ్డి, అంబటి శ్రీనివాస్, భిక్షపతి, సురేందర్ రెడ్డి, సత్యనారాయణ, వెంకటరమణ, జ్యోతిరాజ్, తిరుపతి, రామ్‌రాజ్, రాకేశ్ పాల్గొన్నారు. - మెహిదీపట్నం

సంఘ సంస్కర్త.. రాజా రామ్‌మోహన్ రాయ్

ముషీరాబాద్, ఏప్రిల్ 24 : చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం సంఘ సంస్కర్త రాజా రామ్‌మోహన్ రాయ్ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి హాస్యావధాని టి.శంకర్‌నారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి రాయ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంధ విశ్వాసాలు, అమానవీయ ఆచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహనీయుడు రాజా రామ్‌మోహన్ రాయ్ అని కొనియాడారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, తిరువాణి చంద్రశేఖర్, దేవసేన, గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ వారి విగ్రహ పునః ప్రతిష్ఠ

గోల్నాక, ఏప్రిల్ 24 : అంబర్ పేట ప్రధాన రహదారిలోని ముత్యాలమ్మ గుడిలో శాస్త్రోక్తంగా ముత్యాలమ్మ వారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో గుడి కమిటీ అధ్యక్షుడు నరసింహ, ఉపాధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల హవా

కాచిగూడ, ఏప్రిల్ 24 : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కాచిగూడ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అత్యధిక శాతం మార్కులతో ప్రతిభను చాటారు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్ష పలితాల్లో హెచ్ఈసీ గ్రూపులో పరబత్తిన అభ్యుదయ సుధ 967 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బోయ మధు రిషిత హెచ్ఈసీ గ్రూపులో 928 సాధించినట్లు.. సీఈసీలో పరేహన్‌బేగం 857, ఎ.లక్ష్మణ్ 838, ఎంపీసీలో సదీమ్ అస్లాం 838, కె.మణి చందన 824 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు.

అదే విధంగా మొదటి సంవత్సరం ఎంపీసీ పరీక్ష ఫలితాల్లో సుదం కీర్తి 458 మార్కులతో ఏ – గ్రేడ్ సాధించింది. నీనావత్ ప్రవీణ్ సీఈసీలో 439 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

హైదరాబాద్ బీజేపీ ఎన్నికల కో -ఆర్డినేటర్‌గా ప్రేమ్‌సింగ్ రాథోడ్

అబిడ్స్, ఏప్రిల్ 24 : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల కో– ఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్ నియమితులయ్యారు. కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌సింగ్ రాథోడ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మాధవీ లత ఘన విజయం సాధించేలా వ్యూహ రచన చేస్తామన్నారు. ప్రధాని మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితోనే బీజేపీ విజయం సాధిస్తుందన్నారు.

ఆకట్టుకున్న మట్టి మనిషి నాటకం

రవీంద్రభారతి, ఏప్రిల్ 24 : రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సభా థియేటర్ ఎన్సెంబుల్ సమర్పించు డా.వాసిరెడ్డి సీతాదేవి రచించిన మట్టి మనిషి నాటకం బుధవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో నిర్వహించారు. 1970 ప్రాంతంలో మట్టిమనిషి నవల ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధంలో సీరియల్‌గా ప్రచురించబడింది.1972లో మొదటిసారి ముద్రణ పొందింది.1995– 2000 కాలంలో ఉస్మానియా యూనివర్సిటీవారు ఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు 14 భారతీయ భాషలలోకి అనువదించి ప్రచురింప చేశారు.మాస్టర్ ఫీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ కాలమ్‌లో ప్రస్తావించిన –నన్నయ్య నుంచి నేటి వరకు వెయ్యి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో మట్టి మనిషి నవల 13వ రచనగా పేర్కొనబడింది. నాటకీరణ వల్లూరి శివ ప్రసాద్, దర్శకత్వం నస్రీన్ ఇషాక్ వహించిన కార్యక్రమంలో రసరంజని ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొన్నారు.

మహ్మద్ గౌస్ కుటుంబానికి పరామర్శ

అంబర్‌పేట, ఏప్రిల్ 24 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, సంఘ సేవకుడు మహ్మద్‌గౌస్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ కాచిగూడలోని సీసీ ష్రాప్ దవాఖానలో మంగళవారం మరణించారు. అతడి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సీహెచ్ చంద్రమోహన్, బి.నర్సింగ్ రావు యాదవ్, బుచ్చిరెడ్డి, జ్ఞానేశ్వర్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహ్మద్ గౌస్‌కు నివాళి

మహ్మద్ గౌస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు పి.నారాయణస్వామి, ఆర్.లక్ష్మణ్‌గౌడ్, లక్పతి యాదగిరిగౌడ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, జె.సత్తిబాబు, రామ్మోహన్‌రావు, చెంగలి సుధాకర్, రావుల సుధాకర్‌లతో కలిసి అతడి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. గౌస్ భౌతికకాయానికి వారు శ్రద్ధాంజలి ఘటించారు.

రైలు ఢీకొని వ్యాపారి మృతి

కాచిగూడ, ఏప్రిల్ 24 : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యాపారి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడలోని రహమత్‌నగర్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ అస్లమ్‌హుస్సేన్ (27) బుధవారం టిఫిన్ చేయడానికి యాకత్‌పుర – ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

లైంగికదాడి కేసులో 20 ఏండ్ల జైలు

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : సంజీవ్‌రెడ్డినగర్ పీఎస్ పరిధిలో నమోదైన ఓ మైనర్‌పై లైంగికదాడి కేసులో నిందితుడు జి.రామకృష్ణకు 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి టి.అనిత బుధవారం తీర్పును వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అల్లూరి రాంరెడ్డి కథనం ప్రకారం.. అమీర్‌పేటలోని ఓ పాఠశాల వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ.. మైనర్‌ను వ్యాన్‌లో ప్రతిరోజు తీసుకెళ్లేవాడని, 2022లో బాలికపై లైంగికదాడికి పాల్పడినట్టు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీస్ అధికారి సైదులు కేసు నమోదు చేశారు. అనంతరం సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు చార్జీషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం నేరం చేసినట్టు రుజువుకావడంతో నిందితుడికి శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలలు అదనంగా శిక్షను అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. భరోసా అధికారి టి.కల్పన, శ్రీనాథ్‌రెడ్డి సహకారాన్ని అందించారు.

విద్యార్థి అదృశ్యం

కాచిగూడ, ఏప్రిల్ 24 : ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌లోని ఇందిరానగర్‌కు చెందిన బింగి హర్షిత ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. ఇంట్లోంచి వెళ్లిన హర్షిత తిరిగి రాకపోవడంతో తండ్రి శంకర్ బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికారు. అయినా.. ఆచూకీ లభించక పోవడంతో కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఇంట్లోంచి వెళ్లే సమయంలో హర్షిత తెలుపు టాప్, నీలి రంగు జీన్స్ ప్యాంట్ ధరించింది. ఎత్తు 5.0 ఉన్నట్లు తెలిపారు.తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం

కాచిగూడ, ఏప్రిల్ 24: ఆత్మరక్షణకు కరాటే ఆయుధంలా పనిచేస్తుందని వరల్డ్ రికార్డు ప్రతినిధులు అన్నారు. జీవీఆర్ అకాడమీలో వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో 24 సెకన్లలో 24 నాపరాళ్లను పగలగొట్టే ప్రదర్శనలో కేవలం 20 సెకండ్లలో పగలగొట్టి 24వ వరల్డ్ రికార్డ్స్‌లో కరాటే మాస్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి స్థానం సంపాదించారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, విశ్వం వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో గోపాల్‌రెడ్డి 20 సెకండ్లలో 24 నాపరాళ్లను పగలగొట్టి అందరిని అబ్బురపరిచాడు. 24 వరల్డ్ రికార్డ్స్‌ల్లోస్థానం సంపాదించినందుకుగాను ఆయా వరల్డ్ రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు రికార్డ్స్ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను గోపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వరల్డ్ రికార్డు ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, సుభాషిని, డాక్టర్ ఈశ్వర్, లయన్ విజయ లక్ష్మి, దేవేందర్, కృష్ణయాదవ్, న్యాయవాది అశోక్ ఆనంద్‌కుమార్, జగదీశ్ చంద్ర, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ అచ్యుతా దేవి,డాక్టర ఉమా మహేశ్వర్‌రావు, నేతాజీ, కోట్ల నిరంజన్‌రెడ్డి, కరాటే మాస్టర్లు సమీర్, అమృతారెడ్డి, మాణిక్‌ప్రభు పాల్గొన్నారు.



గోపాల్‌రెడ్డికి రికార్డు పత్రాలను అందజేస్తున్న వరల్డ్ రికార్డు ప్రతినిధులు

నాలా పూడికతీత పనులకు రూ.10.73 కోట్లు విడుదల

అబిడ్స్, ఏప్రిల్ 24 : రాబోయే వర్షాకాలంలో నాలాలలో వర్షం నీరు సాఫీగా పోయేందుకు వీలుగా జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కార్యాలయం పరిధిలో నాలాలలో పూడికతీత పనులను చేపట్టేందుకుగాను 10.73 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారు. ఆయా నిధులతో నాలా పూడికతీత పనులను చేపడుతున్నారు. జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయి. జోనల్ పరిధిలోకి వచ్చే కార్వాన్, నాంపల్లి, గోషామహల్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయాల పరిధిలోకి వచ్చే నాలాలలో మొత్తం 63 పూడికతీత పనులు 171.256 కిలో మీటర్లలో పనులు చేపట్టేందుకు నిధులు విడుదల కాగా అందులో ఇప్పటికి 53.96 కిలో మీటర్ల పనులను పూర్తి చేయడం జరిగిందని ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ తెలిపారు. మిగిలిన పనులను మే 31 లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఫస్ట్‌ల్యాన్సర్ ప్రాంతంలోని నాలాలో పూడికతీత పనులు చేపడుతున్న కార్మికులు

తెలంగాణ పార్టీ విస్తరణ కోసం కృషిచేస్తాం

రవీంద్రభారతి,ఏప్రిల్ 24 : తెలంగాణలో ఏకం సనాతన భారత్ దళ్ పార్టీ విస్తరణ కోసం కృషి చేస్తానని డాక్టర్ పి.సుశీల అన్నారు. హిందువుల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ ఏకం సనాతన భారత్ దళ్ అని, అందుకే ఈ పార్టీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలోఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి ఏకం సనాతన భారత్ దళ్ పోరాడుతుందన్నారు. హిందువులకు బీజేపీలో న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్ చతుర్వేది, పార్టీ ప్రతినిధులు డాక్టర్ బాలకృష్ణభట్, శాంతకుమారి, భగత్‌సింగ్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ రథోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 24 : చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయలో బుధవారం సాయంత్రం సీతరాముల కల్యాణ రథోత్సవం, కోలాటం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యల పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాల వెంకటాద్రి, ఎస్.జి.ఎస్. ఆచార్యులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట : శ్రీరామ నవమి సందర్భంగా ఉప్పుగూడ శ్రీ మంగళముఖి హనుమాన్ ఆలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర బీసీ మోర్చా అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి,గౌలిపుర మాజీ కార్పొరేటర్ అలె జితేంద్ర, ఈ.సుమన్ కుమార్,జ్యోతికుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, ఏప్రిల్ 24 : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడ డివిజన్ దోమలగూడ హుందాబాగ్‌లో ఉంటున్న పి. సుదర్శన్ 19న సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి ఇంటికి తిరిగిరాలేదు. బంధువుల ఇండ్లలో ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సుదర్శన్ కుమారుడు వినోద్ దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

శ్రీ రంగనాథ ఆలయ అర్చకుడు రాజగోపాలాచార్య కన్నుమూత

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 24 : ప్రతిష్టాత్మకమైన జియాగూడ శ్రీ రంగనాథ స్వామి ఆలయం ప్రధాన అర్చకులు శ్రీమాన్ శృంగారం రాజగోపాలాచార్యులు కన్నుమూశారు. మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో రాజగోపాలాచార్యులు కన్నుమూశారని సోదరులు ఎస్‌టీ చారి, శేషాచార్యులు తెలిపారు. రాజగోపాలాచార్యులకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. దేశంలోనే కాకుండా విదేశాలల్లో కూడా శతాధిక ప్రతిష్టాత్మక దేవాలయాల యజ్ఞాచార్యులుగా, దేవతా మూర్తుల అలంకార భట్టర్‌గా రాజగోపాలాచార్యులు ప్రఖ్యాతిగాంచారు. రాజగోపాలాచార్యులు మరణ వార్త తెలుసుకున్న అధికార, అనధికార ప్రముఖులు, వేద పండితులు ఆయన భౌతిక కాయా న్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపా రు. జియాగూడ రంగనాథస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రాజగోపాల చార్యుల అంతిమ యాత్ర పురానాపూల్ శ్మశాన వాటిక వరకు చేరుకొని సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు.